సాక్షి ఒడిశా

ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



ఆలోచన మెరుగు పడాలి

రాయగడ అటానమస్ కాలేజీలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

- 8లో



ఆర్థిక సాయం పంపిణీ

పర్లాకిమిడిలో భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక సాయం పంపిణీ చేశారు. అర్హులు అవగాహన పెంచుకోవాలన్నారు.

- 8లో

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

జయపురం: పట్టణంలోని గుర్రాల శాల మైదానంలో శుక్రవారం సాయంత్రం టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. 8 ఓవర్ల ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో మొత్తం 6 టీములు పాల్గొంటాయని నిర్వాహకులు వెల్లడించారు. ఈ టోర్నమెంట్‌ను నదీమ్ ఖాన్, దిలీప్ పండ, సుల్తాన్ మిర్జ, సదిక్ ఖాన్‌లు నిర్వహిస్తున్నారు. అంపైర్లుగా దిలీప్ గదబ, మనోజ్ నాయిక్‌లు వ్యవహరిస్తున్నారు. ఈనెల 21వ తేదీన ఫైనల్ ఉంటుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

మెగా వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: పట్టణంలోని ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ (ఓఎంసీ) కార్యాలయ ప్రాంగణంలో మెగా వైద్య శిబిరాన్ని నేషన్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, పారమౌంట్ టీపీఏ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా శనివారం నిర్వహించాయి. దీనిలో భాగంగా కటక్, భువనేశ్వర్‌కు చెందిన వైద్యులు ఉచితంగా ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ సకాలంలో వైద్యం అందితే ఆరోగ్యకరంగా ఉంటారని పేర్కొన్నారు. అవసరమైనవారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఐసీకి చెందిన సుజిత్ కుమార్ పండ, పారమౌంట్ టీపీఏ కంపెనీకి చెందిన విభూతి దాస్‌లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించాలి



విద్యార్థులను అభినందిస్తున్న దొళాయి తదితరులు

రాయగడ: విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారిని ఆయా రంగాల్లో ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని సీనియర్ పాత్రికేయుడు మనోరంజన్ దొళాయి అన్నారు. జిల్లాలోని మునిగుడ సమితి పాత్రగుడ ప్రాంతీయ సాధన కేంద్రం ఆధ్వర్యంలో కొరాడబంధ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోటీతత్వం అవసరమన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొరాడబంధ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కల్యాణి లింగమ్, బీఈవో వి.భాస్కరరావు, సాధన కేంద్రం కన్వీనర్ అశ్విని బారిక్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పాదపూజలు



సరస్వతీ శిశు మందిరంలో మాతాపిత పూజలు

జయపురం: స్థానిక సరస్వతీ శిశు మందిర పాఠశాలలో మాతాపిత పూజా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలకు పూజ చేశారు. సరస్వతీ విద్యామందిర ప్రధాన ఉపాధ్యాయులు ఆచార్య సత్యనారాయణ సెఠి అధ్యక్షతన జరిగిన మాతాపిత పూజా కార్యక్రమంలో విద్యార్థులు, వారి పిల్లలు కలిసి 180 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో నవరంగపూర్ జిల్లా తారాగాం రష్మీ రంజన్ సేవాశ్రమ అధ్యక్షుడు డాక్టర్ నీలకంఠ పాడి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో విద్యాలయ సీనియర్ ఉపాధ్యాయులు కైలాస చంద్ర పండ సతీసమేతంగా హోమ కర్తలుగా పాల్గున్నారు. విద్యాలయ పరిచాలన కమిటీ అధ్యక్షుడు కిశోర్ చంద్రపండ,కార్యదర్శి తపన కిరణ త్రిపాఠీ రామ చంద్ర మహంతిలుకార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

స్థల సేకరణకు కసరత్తు



స్టేడియం స్థల ఎంపికకు పలు ప్రాంతాలు సందర్శిస్తున్న బీడీఓ తదితరులు

జయపురం: జయపురం సమితిలో క్రీడా ప్రగతికి స్టేడియం నిర్మించేందుకు అవసరమైన స్థలం కోసం అధికారులు సమితిలో అనువైన స్థలం కోసం ప్రయత్నిస్తున్నారు. సమితి బీడీఓ శక్తి మహాపాత్రో, జయపురం తహసీల్దార్ సవ్యసాచి జెన, రెవెన్యూ సూపర్‌వైజర్ హరిహర శతపతి సమితిలో స్టేడియం నిర్మాణానికి అనువైన స్థలం కోసం పరిశీలన చేస్తున్నారు. వారు అంబాగుడ ప్రాంతంలోగల 10 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఆ స్థలం స్టేడియం నిర్మాణానికి అనువైనది కాదని భావించి ధనపూర్ ప్రాంతంలోగల 10 ఎకరాల భూమిని సందర్శించి పరిశీలించారు. అన్ని ఆటలకు అనువుగా ఉండే స్టేడియం నిర్మాణం చేయనున్నట్లు బీడీఓ శక్తి మహపాత్రో వెల్లడించారు.

అడవి నుదుట.. ప్రగతి రాత

- చిత్రకొండ సమితిలో అభివృద్ధి పనులు
- కంప్యూటర్ శిక్షణ అందజేస్తున్న బీఎస్‌ఎఫ్ జవాన్లు



మావో ఎర్రకోటలో ఇప్పుడు పోలీసుల స్కిల్ కంప్యూటర్ సెంటర్



కోట వద్ద మావో అగ్రనేతల గుర్తుగా నిర్మించిన స్థూపం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి అంటే కటాఫ్ ఏరియాగా మావోయిస్టుల అడ్డాగానే దేశానికి యాభై ఏళ్లుగా తెలుసు. ఏ క్షణంలో మావోలు ఏ విధ్వంసం సృష్టిస్తారో అని ఈ ప్రాంత ప్రజలు భయంతో బతికేవారు. నిత్యం తూటా చప్పుళ్లతో ప్రశాంతత అన్నదే లేకుండా ఇక్కడి ఊళ్ల రోజులు గడిచేవి. ఎందరో గిరిజనులు ఇన్‌ఫార్మర్ల పేరిట హత్యలకు గురయ్యారు.. ఇంకెందరో గ్రామ బహిష్కరణలకు గురయ్యారు. కానీ 2015 తర్వాత ఇక్కడ విపరీతమైన మార్పులు వచ్చాయి. గురుప్రియ వంతెన నిర్మించి 2018లో వంతెన ప్రారంభంతో ఈ కటాఫ్ ఏరియాను మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయిక్ స్వాభిమాన్‌ఏరియాగా మార్చారు. ఇక్కడ అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో బీఎస్‌ఎఫ్ జవాన్లు చొరవ తీసుకున్నారు.

మావోయిస్టులు నిర్మించిన ఎర్రకోటను పోలీసులు కంప్యూటర్ సెంటర్‌గా మార్చి గిరిజన యువతకు శిక్షణ అందిస్తున్నారు. చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా జోడాంబో పంచాయతీలో రహదారి పక్కనే మావోలు ఎర్రకోటను నిర్మించి ఏటా వారోత్సవాలు నిర్వహించేవారు. ఆంధ్రా–ఒడిశా–ఛత్తీస్‌గఢ్ నుంచి మావో అగ్రనేతలు వచ్చి ఇక్కడే బస చేసి సమావేశాలు నిర్వహించేవారు. అప్పట్లో ఈ ప్రాంతానికి ఏ రాజకీయ నాయకుడు గానీ, అధికారి గానీ వచ్చేవారు కాదు. ఈ కటాఫ్ ఏరియాలో ఎన్నికలు గానీ, స్వాతంత్ర్య దినోత్సవాలు గానీ ఏనాడూ జరగలేదు. కేవలం మావోలు ఎగరేసిన నల్ల జెండాలే ఇక్కడి గిరిజనులకు తెలుసు. ఈ పరిస్థితులు మార్చాలనే లక్ష్యంతో బీఎస్‌ఎఫ్ జవాన్లు రంగ ప్రవేశం చేశారు. మొదట మావో ప్రభావిత ప్రాంతమైన కలిమెల, పోడియా, చిత్రకొండ, మత్తిలి నాలుగు సమితుల్లో జవాన్లు కాపు కాసి అడవి మార్గాల్లో కూంబింగ్‌లు నిర్వహించేవారు. మావోలు వెళ్లిపోయాక చిత్రకొండ ఏరియాలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ స్వాభిమాన్ ఏరియాలో 9 పంచాయతీలు మావోయిస్టుల కబ్జాలో ఉండేవి. జోడాంబో, పనాస్‌పూట్, రల్లేగడ, గాజుల్‌మమ్ముడి, పెప్పరమేట్ల, బోడపోదర్, బోడపోథ జాంత్రీ, ఓంద్రాపల్లి పంచాయతీల్లో రహదారులు లేక చిత్రకొండ జలాశయంలో నాటు పడవలు, లాంచీలతో గిరిజనులు ప్రయాణం చేసేవారు. వారికి ప్రభుత్వ పథకాలేవీ అందేవి కావు. వారిలో చైతన్యం కల్పించడం కోసం బీఎస్‌ఎఫ్ జవాన్లు ఎన్నో ప్రయత్నాలు చేశారు. అప్పటి నుంచి గిరిజనులు కూడా వారికి సహకారంగా ఉన్నారు. ఈ అడవి తప్ప బయట ప్రపంచం తెలియని గిరిజనులకు తొలిసారిగా బీఎస్‌ఎఫ్ జవాన్లు పూరీ శ్రీక్షేత్రం యాత్రకు తీసుకెళ్లారు. అలా ఒక్కొక్కరుగా చదువుపై ఆసక్తి చూపారు. కొందరు క్రీడలు ఆడడం మొదలుపెట్టారు. ఇప్పుడు మావోలు నిర్మించిన ఎర్రకోటలో పోలీసు కంప్యూటర్ స్కిల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఎంతో మంది గిరిజన యువతీ యువకులు కంప్యూటర్ నేర్చుకుంటున్నారు.



ఒకప్పుడు గురుప్రియ వంతెన స్థలం



ప్రస్తుతం గురుప్రియ వంతెన



తొలిసారి మావో స్థూపాన్ని విరిచి బీఎస్‌ఎఫ్ బోర్డును నిర్మించిన జవాన్లు



గిరిజన యువత కోసం కంప్యూటర్లు



చిత్రకొండ జలాశయంలో లాంచీల ప్రయాణం

గవర్నర్‌ను కలిసిన ప్రతిపక్ష నాయకులు



భువనేశ్వర్‌లో రాష్ట్ర భవన్‌లో గవర్నర్‌ను కలిసిన బీజేడీ ప్రతిపక్ష నాయకుల బృందం

పర్లాకిమిడి: ఒడిశాలో అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పంటనష్ట పరిహారం చెల్లించాల్సిందిగా బీజేడీ పార్టీ ప్రతిపక్ష నేత ప్రసన్న ఆచార్య నేతృత్వంలో అనేక జిల్లాల శాసన సభ్యులు గవర్నర్ హరిబాబును శనివారం భువనేశ్వర్‌లో కలిశారు. కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఉన్న దృష్ట్యా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ మఝి ప్రకటించిన పంటనష్టం చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఒక వినతిని అందజేశారు. బృందంలో పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి కూడా పాల్గొని గజపతి జిల్లా రైతుల పంటనష్టం పరిహారం అందించాలని కోరారు.



రాష్ట్ర గవర్నర్ హరిబాబును కలిసిన పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

నాలుగు రాష్ట్రాల ఇన్‌చార్జిగా సప్తగిరి



సప్తగిరి శంకర్ ఉలక

రాయగడ: దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి ఆ పార్టీ అధిష్ఠానం నడుం బిగించింది. దీనిలో భాగంగా వివిధ రాష్ట్రాలకు పార్టీ ఇన్‌చార్జిలను నియమించింది. కొరాపుట్ లోక్‌సభ స్థానం ఎంపీ సప్తగిరి శంకర్ ఉలకను మణిపూర్, త్రిపుర, సిక్కిం, నాగాలాండ్ రాష్ట్రాలకు ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్లు ఏఐసీసీ సాధారణ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో నవ వధువు మృతి

- హత్య చేశారంటూ కన్నవారు పోలీసులకు ఫిర్యాదు
- పోలీసుల అదుపులో భర్త

రాయగడ: అనుమానాస్పద స్థితిలో నవవధువు ప్రాణాలు కోల్పోయింది. ఆత్మహత్య చేసుకుందని అత్తింటివారు అంటుండగా.. భర్తే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని అమ్మాయి తరపువారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో భర్తను పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. పెళ్లయి ఐదు నెలల గడిచాయి. అన్యోన్యంగా కాపురం చేసుకుంటున్న ఆ దంపతుల్లో ఎటువంటి తగాదాలు నెలకొన్నాయో గాని ఆ నవ వివాహిత ఉరికి వేలాడుతూ శవమై కనిపించింది. స్థానిక సాయిప్రియ నగర్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే తన కూతురు ఆత్మహత్య చేసుకోలేదని ఇది ఆమె భర్తే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సదరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు వివాహిత భర్తను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం.. స్థానిక సాయి ప్రియ నగర్‌లో బిభూతి కిశోర్ బాగ్ (21) ఆమె భర్త రమేష్ నాయక్‌లు ఐదు నెలల క్రితం వివాహం చేసుకుని నివాసముంటున్నారు . ఈ క్రమంలో శుక్రవారం రాత్రి బిభూతి కిషొర్ బాగ్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అనంతరం ఆమెను చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి రమేష్ తీసుకువచ్చాడు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అయితే ఇది ఎంతమాత్రం ఆత్మహత్య కాదని తన కూతురును భర్తే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని మృతురాలి కుటుంబీకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఇది హత్యా, లేక ఆత్మహత్యా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.



బిభూతి కిశోర్ బాగ్ మృతదేహం

ఏపీడీపై యువతి ఫిర్యాదు

జయపురం: స్థానిక విమానాశ్రయం ఏపీడీ మోహన్ పారిడ, అతడి భార్యపై ఒక యువతి జయపురం మహిళ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఫిర్యాదు చేసింది. విమానాశ్రయంలో పనిచేస్తున్న సదరు యువతి తనను శారీరక, మానసిక వేధింపులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. జయపురం రోడ్లు, భవనాల విభాగం ద్వారా ఔట్ సోర్సింగ్‌లో ఆ యువతి స్థానిక విమానాశ్రయంలో పనిచేస్తోంది. అయితే ఆమె పనిచేస్తున్న సమయంలో ఏపీడీ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపించింది. అంతేకాకుండా ఏపీడీ తనను అతని ఇంట్లో పనిచేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు వాపోయింది. ఉద్యోగం పోతుందనే భయంతో మరో గత్యంతరం లేక ఏపీడీ ఇంట్లో సైతం పనిచేస్తున్నట్లు తెలిపింది. ఆ సమయంలో అతడి భార్య లీనా తనను అసభ్యపదజాలం, కులం పేరుతో దూషిస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో పోలీసులు ఏపీడీ మోహన పారిడ, అతడి భార్య లీనాలను ప్రశ్నిస్తున్నారు. డీఎస్పీ బిరంచి నారాయణ జగతో దర్యాప్తు చేపట్టారు. విమానాశ్రయ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఈశ్వర తండి సైతం ఆరోపణలపై దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. అయితే మహిళ చేసిన ఆరోపణలను ఏపీడీ మోహన పారిడ ఖండించారు.



పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన యువతి

వర్సిటీకి చేరిన +2 పరీక్ష పత్రాలు

జయపురం: ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభంకానున్న +2 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు విక్రమదేవ్ విశ్వవిద్యాలయానికి చేరాయి. 3,400 మంది +2 పరీక్షలు రాయనున్నట్లు విక్రమదేవ్ హయ్యర్ సెకండరీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ పాత్రో శనివారం తెలియజేశారు. ఈసారి సైన్స్, ఆర్ట్స్, కామర్స్, వొకేషనల్ విభాగాల్లో వీరంతా పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. విక్రమదేవ్ విశ్వద్యాలయ పరిధిలో విక్రమదేవ్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ మహిళా సెకండరీ కళాశాల, శ్రీవిక్రమార్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ కళాశాల, కుంద్రా బిజూ పట్నాయక్ కాళాశాల, లమతాపుట్ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జూనియర్ కళాశాల, కాకలపడ హయ్యర్ సెకండరీ పాఠశాల, బొయిపరిగుడ సహిద్ లక్ష్మణ నాయిక్ జూనియర్ కళాశాల, బముణిపుట్ ఎస్.ఎస్.డి. ఉన్నత పాఠశాల కేంద్రాల్లో పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుంది. మార్చి 27వ తేదీతో పరీక్షలు ముగిస్తాయి.



విక్రమదేవ్ కళాశాల

ఆరోగ్యమే ప్రధాన లక్ష్యం కావాలి



హాజరైన వివిధ సంస్థల ప్రతినిధులు



మాట్లాడుతున్న సురక్షా అధికారి సరలా పాత్రో

పర్లాకిమిడి: మెరుగైన ఆరోగ్యమే అందరి లక్ష్యం కావాలని వక్తలు అన్నార. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక కలెక్టరేట్ హాల్–2లో జిల్లా యంత్రాంగం, వివిధ స్వచ్ఛంద సంస్థలతో చైతన్య కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటుచేశారు. జిల్లా శిశు సంక్షేమ సమితి చైర్మన్ అశ్వినీ కుమార్ మహాపాత్రో, జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారిని మినాతి దేవి, జిల్లా శిశు సంరక్షణ అధికారి (డీసీపీయూ) అరుణ్ కుమార్ త్రిపాఠి, సురక్షా అధికారి సరలా పాత్రో తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో మానసిక మహిళా రోగులు, మైనర్ బాలికలు, నవజాత శిశువుల సంరక్షణలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి వివరించారు. మానసిక వైజ్ఞానికులు డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్రో, మానసిక ఆరోగ్యం కార్యకర్తలు ప్రాణరంజన్ నాయక్, ప్రత్యూష్ పండా, ఒన్ స్టాప్ సెంటర్, చైల్డ్‌లైన్, శక్తిసాధన కార్యకర్తలు, వృద్ధాశ్రమం స్వచ్ఛంద సేవకులు, యాక్షన్ ఎయిడ్, అరుణ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దుతున్న శిశు విద్యాలయాలు

జయపురం: సరస్వతీ శిశు మందిర విద్యాలయాలు విద్యార్థులను ఉత్తమ చరితులుగా తీర్చిదిద్దుతున్నాయని జాగృతీ మండల్ ట్రస్టు రాయిపూర్ అధ్యక్షులు కువార్ రాజా బహదూర్ సింగ్ రాణా ప్రశంసించారు. శుక్రవారం సాయంత్రం జయపురం సబ్‌డివిజన్ కోట్‌పాడ్ సరస్వతీ శిశు విద్యామందిర వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. పాఠశాలలు విద్యార్థులను ప్రతిభవంతులుగా తీర్చిదిద్దే ఖార్కానాలు కావాలన్నారు. కొరాపుట్ కేంద్ర విశ్వవిద్యాలయ అధ్యాపకులు డాక్టర్ సీతానాథ్ రాయగురు గౌరవఅతిథిగా పాల్గొన్నారు. సరస్వతీ శిశుమందిర విద్యాలయ పరిశీలన కమిటీ అధ్యక్షులు గౌరీ ప్రసాద్ రౌత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన పిల్లలకు ముఖ్య అతిథి రాజా బహదూర్ సింగ్ రానా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సరస్వతీ శిశు మందిర పాఠశాల గురు, గురుమాలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నేటి నుంచి శ్రీలక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలు

రాయగడ: కొలనార సమితి అమలాభట్ట సమీపంలో గల శ్రీక్షేత్ర టౌన్‌షిప్ ప్రాంగణంలో నిర్మించిన శ్రీలక్ష్మీనృసింహుని ప్రథమ వార్షికోత్సవంతో పాటు స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయ ధర్మకర్త దూడల శ్రీనివాస్ దంపతులు సంప్రదాయబద్ధంగా స్థానిక మజ్జిగౌరి అమ్మవారి మందిరానికి శనివారం వెళ్లి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి అమ్మవారికి ఆహ్వాన పత్రికను అందజేశారు. మేళ తాళాలతో, పండితుల మంత్రోచ్ఛరణలతో అమ్మవారి మందిరానికి చేరుకుని పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకుని వేదిక వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి సమర్పించిన పసుపు, కుంకుమలను తీసుకువచ్చి నృసింహ స్వామి వద్ద నిలిపి ప్రత్యేక పూజలను నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు.

ఉత్సవ మూర్తులతో శోభా యాత్ర

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జేకేపూర్‌లో గల శ్రీవేంకటేశ్వర ఆలయం నుంచి అత్యంత వైభవంగా శోభాయాత్రను నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ఈ యాత్రలో వివిధ ప్రాంతాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని ఆలయ ధర్మకర్త శ్రీనివాస్ తెలియజేశారు. ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకువెళతారు. మంత్రోచ్ఛరణలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఊరేగింపు కొనసాగుతుంది. ఈ నెల 21వ తేదీ వరకు ఈ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు.



పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహుడు



మజ్జిగౌరి అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించేందుకు వచ్చిన శ్రీనివాస్ దంపతులు



సిద్ధమవుతున్న ఉత్సవ రథం



కొత్తగా నిర్మితమవుతున్న లక్ష్మీనృసింహుని మందిరం

క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి


ఉత్తమ డ్రైవర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న అధికారులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ బస్సులు డ్రైవింగ్ చేసిన సమయంలో విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో గ్యారేజీ ఆవరణలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయకుమార్ అధ్యక్షతన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ నిజాయితీ, అంకితభావం, క్రమశిక్షణతో డ్రైవింగ్ చేయాలన్నారు. ప్రాంతీయ రవాణా అధికారి రాజు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ల సేవలను కొనియాడారు. ప్రజా రవాణా అధికారి ఏ.విజయకుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. అనంతరం శ్రీకాకుళం 1, 2 డిపోలు, టెక్కలి, పలాస డిపోలలో సుదీర్ఘకాలం ప్రమాద రహిత రికార్డు కలిగిన డ్రైవర్లు బి.వి.ఆర్.మూర్తి, వై.జి.రావు, కె.రమణలకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1–2 డిపో మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్‌ఎస్ శర్మ, టెక్కలి డీఎం శ్రీనివాసరావు, పలాస డిపో మేనేజర్ సన్యాసిరావు, సూపర్‌వైజర్లు, అసోసియేషన్ నాయకులు, భద్రతా దళం – నిఘా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులతో స్నేహపూర్వకంగా మెలగాలి


మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిన్నారులతో స్నేహపూర్వకంగా మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. బాలల రక్షణ, సంక్షేమం, జువైనల్ జస్టిస్ బోర్డు పనితీరు, పిల్లల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై శనివారం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. జేజేబీ పనితీరు, ప్రీ లోక్ అదాలత్ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం 12 కేసులు రాజీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు మంచు జనార్దనరావు, ఎన్ని సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ పరీక్షలు ప్రారంభం


వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్ సోయాబ్ అలామ్

శ్రీకాకుళం రూరల్: కేంద్రీయ విద్యాలయంలో సీబీఎస్‌ఈ సిలబస్‌కు సంబంధించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ సోయాబ్ అలామ్ తెలిపారు. పాఠశాలకు చెందిన 119 మంది విద్యార్థులతో పాటు గాయత్రీ స్కూల్‌కు చెందిన మరో 87 మంది ఇదే కేంద్రంలో పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం సీసీ కెమెరాల పర్యవేక్షణలో అన్ని వసతుల మధ్య ప్రశాంతంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి మొదటి వారంలో బాలవాటిక నోటిఫికేషన్ ఉంటుందన్నారు. రెండో తరగతి నుంచి 9వ తరగతి వరకూ వ్యాకెన్సీ పొజిషన్ కూడా త్వరలో విడుదలవుతుందని చెప్పారు.

రక్షిత మంచినీటి పథకంలో క్లోరినేషన్


సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును శుభ్రం చేస్తున్న సిబ్బంది

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్ర వీధి సమీపంలోని ఎర్రన్నాయుడు రక్షిత మంచినీటి పథకం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో పడి శుక్రవారం ఓ వ్యక్తి మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ నీటినే వీధి కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో శనివారం శ్యాంపిల్ టెస్ట్ నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో సమ్మర్ ట్యాంక్‌లో క్లోరినేషన్ చేపట్టారు. పరిసరాల్లో జంగిల్ క్లియరన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈ రామకృష్ణ, ఏఈ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక సాయం పంపిణీ


భవన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్


భవన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: జిల్లాలో భవన కార్మికులు, ఇతర వలస కార్మికులు 60 మంది చేతివృత్తులు ఎవరైనా సరే తమ పేర్లను వెంటనే నమోదు చేసుకోవాలని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. విధి నిర్వహణలో వారికి ప్రాణాపాయం జరిగితే వారి కుటుంబ సభ్యులకు రూ. 2.50 లక్షలు, వారి పిల్లల పెళ్లిళ్లు, ఉన్నత చదువులకు రాష్ట్ర ప్రభుత్వ భవన కార్మికులు, నిర్మాణ శ్రామిక సంక్షేమ బోర్డు ద్వారా ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని కలెక్టర్ దాస్ అన్నారు. స్థానిక యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం హాలులో నిర్వహించిన గజపతి జిల్లా భవన నిర్మాణ కార్మికుల ఆర్థిక సాయం వితరణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జాయింట్ లేబర్ కమిషనర్ (బరంపురం) సుమిత్రా మరియు, డివిజనల్ లేబర్ కమిషనరు బాబు చరణ్ పాత్రో, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (జిల్లా పరిషత్ వెంకట్రావు ఆచారి) పాల్గొనగా జిల్లా కార్మిక శాఖ అధికారిని భారతీ బెహరా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భవన కార్మికుల కుటుంబాలకు చెందిన 391 మంది లబ్ధిదారులకు రూ. 3కోట్ల 35 లక్షల 58వేల, 200లు చెక్కులను కలెక్టర్ బిజయ కుమార్ దాస్ చేతులమీదుగా అందజేశారు. అలాగే 54 మంది ఒడిషా భవనకార్మికుల వెల్ఫేర్ బోర్డు సభ్యత్వ ఐడీ కార్డులను కూడా అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం భవన కార్మికుల కుటుంబాలకు మరణాంతర లబ్ధి 147 మంది రూ. 3కోట్ల 3లక్షల విలువైన చెక్కులు పొందగా, వివాహ ఖర్చులకు రూ. 20లక్షల 50వేల రూపాయలు 41 కుటుంబాలకు అందజేశారు.

సిక్కోలు బౌలర్‌కు.. లక్కీ చాన్స్

టాలెంట్




రాజాన జున్నారావు

- మెక్‌గ్రాత్ క్రికెట్ అకాడమీ సెలక్షన్ ట్రయల్స్‌కు రాజాన జున్నారావు
- మార్చి 13 నుంచి 15 వరకు ఎంపికలు
- ఇప్పటికే అనేక టోర్నీలలో రాణిస్తున్న యువ కెరటం

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడల ఖిల్లా శ్రీకాకుళం జిల్లా నుంచి మరో క్రికెటర్‌కు అరుదైన అవకాశం లభించింది. ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు లెజెండ్, ప్రఖ్యాత పేస్ బౌలర్ గ్లెన్ మెక్‌గ్రాత్ నిర్వహిస్తున్న ఎంఆర్‌ఎఫ్ పేస్ అకాడమీ మార్చి 13 నుంచి 15 వరకు చెన్నై వేదికగా సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించనుంది. 18 ఏళ్లలోపు పేస్ బౌలర్లను గుర్తించి, ఎంపికచేసే ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇద్దరు బౌలర్లకు అవకాశం లభించగా.. అందులో ఒకరు మన శ్రీకాకుళం జిల్లావాసి రాజాన జున్నారావు కావడం విశేషం. సెలక్షన్ ట్రయల్స్‌లో ఎంపికైతే జున్నారావు భవిష్యత్తుకు తిరుగులేదని జిల్లా క్రికెట్ సంఘ ప్రతినిధులు భావిస్తున్నారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు..

పలాస మండలం అల్లుకోల గ్రామానికి చెందిన దినసరి కూలీలు రాజాన జగ్గారావు, చంద్రమ్మల కుమారుడు జున్నారావు. 9వ తరగతిలో ఉండగానే జిల్లాస్థాయి క్రికెట్ సెలక్షన్స్‌లో పాల్గొని మీడియం పేస్ బౌలింగ్‌తో సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఏసీఏ 2022, 2023 ఏడాదిల్లో వరుసగా అంతర్‌జిల్లాల అండర్–16 క్రికెట్ టోర్నీలకు ఎంపికై సత్తాచాటాడు.

వినూ మన్కడ్ టోర్నీలో రాణింపు..

2024 అక్టోబర్, నవంబర్‌లో తొలిసారి ఏసీఏ అండర్–19 అంతర్‌జోనల్ త్రీడేస్ మ్యాచ్‌ల్లో పాల్గొని రికార్డుస్థాయిలో 24 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఏసీఏ అండర్–19 అంతర్‌జోనల్ వన్డే టోర్నీల్లో శ్రీకాకుళం జట్టును విజయపథంలో నిలిపాడు. దీంతో బీసీసీఐ నిర్వహించిన ప్రతిష్టాత్మక వినూ మన్కడ్ ట్రోఫీ అండర్–19 అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నీకి ఎంపికయ్యాడు. పంజాబ్‌లోని మొహాలి వేదికగా జరిగిన ఈ టోర్నీల్లో 12 వికెట్లు రాణించాడు. హిమాచల్‌ప్రదేశ్‌పై 35 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. ఆ మ్యాచ్‌ల వీక్షణకు వచ్చిన ఏసీఏ పెద్దలు, సెలక్టర్లు జున్నారావు బౌలింగ్ వేగం, శైలిని ప్రసంశించారు. అదే టోర్నీలో హైదరాబాద్, గోవా, తమిళనాడు, చండీగర్‌లతో జరిగిన మ్యాచ్‌ల్లో 12 వికెట్లతో మెరిశాడు. 125–128 కి.మీ వేగంతో బంతులను సంధిస్తున్న జున్నారావును సెలక్షన్ ట్రయల్స్ పాల్గొవాలని తాజాగా ఏసీఏకు వర్తమానం అందింది. జున్నారావుకు పిలుపు పట్ల తల్లిదండ్రులతోపాటు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీవైఎస్ శాస్త్రి, కార్యదర్శి హసన్ రాజా షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ, డాక్టర్ ఎస్.రవికుమార్, ఆర్సీ రెడ్డి, సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రికెటర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకుంటాను..

అకాడమిలో రాణించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను. రంజీలు, ఆ తర్వాత ఐపీఎల్‌కు ఎంపికే లక్ష్యంగా ఆడుతున్నాను. నిరంతరం ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, జిల్లా క్రికెట్ సంఘ పెద్దలు, కోచ్‌లకు కృతజ్ఞతలు.

– రాజాన జున్నారావు, యువ క్రికెటర్

పరిసరాల శుభ్రత సామాజిక బాధ్యత


తడి చెత్త పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ స్వప్నిల్, ఆర్డీఓ కృష్ణమూర్తి

టెక్కలి: పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి సామాజిక బాధ్యతని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పంచాయతీ పరిశుభ్రతపై శనివారం టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తితో కలిసి టెక్కలిలో పర్యటించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. నిర్వహణ తీరు సరిగ్గా లేకపోవడంతో ఈఓ జగన్నాథంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం సమీప ఇళ్ల వద్దకు వెళ్లి తడి చెత్త పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. పట్టుమహదేవి కోనేరును పరిశీలించి పార్కుగా చేసే క్రమంలో పూర్తి స్థాయి నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం టెక్కలి పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పంచాయతీను సుందరంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్య కార్మికులు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ భారతి సౌజన్య, వంశధార డీఈఈ శేఖర్‌బాబు, డ్వామా ఏపీడీ శైలజ, జిల్లా వనరుల కేంద్రం కోఆర్డినేటర్ నిశ్చల, ఎంపీడీఓ సీహెచ్.లక్ష్మీబాయి, డీఎల్‌పీఓ గోపి బాల, ఏపీఎం బి.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా గుట్టురట్టు


కాశీబుగ్గ: గంజాయితో పట్టుబడిన నిందితులతో డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐ సూర్యనారాయణ

కాశీబుగ్గ: ఒడిశా నుంచి ముంబైకు గంజాయి తరలించేందుకు ప్రయత్నించిన నలుగురు ఒడిశా వాసులను కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. శనివారం కాశీబుగ్గ పట్టణ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ వెంకట అప్పారావు విలేకరులకు వివరాలు వెల్లడించారు. గంజాం జిల్లా బుర్జైపహాడా గ్రామానికి చెందిన బిక్రమ్ మండల్, సునంద సవరలు 8 కేజీల గంజాయిని ముంబై తరలించేందుకు పలాస రైల్వే స్టేషన్‌కు రాగా పోలీసులు పట్టుకున్నారు. అదే విధంగా, ఒడిశా రాష్ట్రం గండాహాతి వాటర్ ఫాల్స్ సమీపంలో గంజాయిని పండించి అందులో మూడు కేజీల అమ్మేందుకు పలాస రైల్వేస్టేషన్‌కు వచ్చిన గంగవైన ఉదయకుమార్, గౌరవ్ పారివా పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని కలిసేందుకు వచ్చిన మరో ఇద్దరు పరారయ్యారు. రెండు కేసుల్లో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు కేజీల గంజాయితో..

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి ముంబైకు గంజాయి అక్రమ రవాణా చేయడానికి ప్రయత్నించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలిస్తున్నట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. ఇచ్ఛాపురం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా అంతర్భదవచుడంగపూర్ గ్రామానికి చెందిన మిలన్ పరిచ్చా అనే యువకుడు అదే రాష్ట్రానికి చెందిన చంద్రు అనే వ్యక్తి వద్ద 6.220 కేజీల గంజాయిని కొనుగోలు చేశాడు. బరంపురంలో బస్సు ఎక్కి ఇచ్ఛాపురం చేరుకున్నాడు. అనంతరం బెంగళూరు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గంజాయితోపాటు సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. ముంబైలో గంజాయి వ్యాపారి ప్రేమానందమల్లిక్‌కు అందజేసేందుకు గంజాయి తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సమావేశంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, ఎస్సై ముకుందరావు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి రైతు దుర్మరణం


తమ్మినేని భాస్కరరావు (ఫైల్)

పొందూరు/ఆమదాలవలస రూరల్: ట్రాక్టర్ బోల్తాపడి రైతు మృతి చెందిన ఘటన ఆమదాలవలస మండలం బెలమాం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పొందూరు మండలం తాడివలసకు చెందిన తమ్మినేని భాస్కరరావు(51) తనకు ఉన్న ఎకరా పొలంతో పాటు సుమారు ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. కొద్ది నెలల క్రితం ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి దుక్కులు దున్నడం, పొలం పనులు చేయడం వంటి పనులు చేస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం ఉదయం 5 గంటలకు వ్యవసాయ పనుల కోసం సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న ఆమదాలవలస మండలం బెలమాం గ్రామంలోని పొలాన్ని దున్నేందుకు ట్రాక్టర్‌పై వెళ్లాడు. పొలం లోతట్టులో ఉండటంతో ట్రాక్టర్ బోల్తా పడి భాస్కరరావు కిందనే చిక్కుకుపోయాడు. స్థానికులు గుర్తించి బయటకు తీసేసరికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న భార్య రమణమ్మ అక్కడికక్కడే కుప్పకూలింది. ఆమదాలవలస ఎస్సై బాలరాజు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

నందిగాం: మండలంలోని కొత్తగ్రహారం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. పలాస మండలం రేగులపాడుకు చెందిన దాసరి భీమయ్య(65) నందిగాం మండలం భోరుభద్రలోని బంధువుల ఇంట్లో జరగనున్న గావు సంబరం కోసం కాలినడకన బయలుదేరాడు. కొత్తగ్రహారం వద్దకు వచ్చేసరికి టెక్కలి నుంచి పలాస వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన భీమయ్య అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం తెలుసుకున్న నందిగాం ఎస్సై షేక్ మహమ్మద్ ఆలీ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని 108 అంబులెన్సులో టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భీమయ్యకు భార్య తులసమ్మ, వివాహమైన ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తులసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలోచన ధోరణి మెరుగుపడాలి



ప్రసంగిస్తున్న ఏఎస్పీ పాత్రో

రాయగడ: విద్యార్థుల్లో ఆలోచన ధోరణి మెరుగుపడాలని జిల్లా అదనపు ఎస్పీ విష్ణు ప్రసాద్ పాత్రో అన్నారు. స్థానిక అటానమస్ కళాశాలలో జిల్లా పోలీస్ యంత్రాంగం శనివారం రోడ్డు భద్రత, సైబర్ సురక్ష అన్న అంశాలపై చైతన్య కార్యక్రమాలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రసంగిస్తూ ట్రాఫిక్ నియమనిబంధనలను పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించుకోవచ్చని తెలిపారు. ఆలొచన ధోరణి మెరుగుపడితే సైబర్ మోసగాళ్ల బారి నుంచి తప్పించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలొ ఎస్‌డీపీఓ రష్మి రంజన్ సేనాపతి, కళాశాల ప్రిన్సిపాల్ బాబిలత షరఫ్, సైబర్ సెల్ అధికారి కె.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.


చైతన్య కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

75 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు నిందితులకు రిమాండ్


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో పోలీసు సిబ్బంది

రోలుగుంట: అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలంలో కొంతలం– వడిప గ్రామాల మార్గమధ్యంలో అక్రమంగా నిల్వ ఉంచిన 75 కిలోల గంజాయిని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రామకృష్ణారావు వివరాల ప్రకారం .. మండలంలో ఉవ్వసింగు గ్రామానికి చెందిన కొర్రా నవీన్‌తోపాటు ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ మండలం పూరణటిక్ పోదూర్ గ్రామానికి చెందిన ఖిలా సోమనాథ్ కొంతలం– వడిప గ్రామాల మధ్య జీడితోటలో 75 కిలోల గంజాయి నిల్వ ఉంచారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం రావడంతో దాడులు చేశారు. గంజాయితోపాటు రెండు మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని కొనుగోలు చేసి తిరుపతిలో విక్రయించడానికి సిద్ధమవుతుండగా పట్టుబడ్డారు. దీని విలువ రూ.3.75 లక్షలు ఉంటుందని అంచనా. నిందితులను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చగా, 14 రోజుల పాటు రిమాండ్ విధించారని ఎస్‌ఐ తెలిపారు.

ముగిసిన రహదారి భద్రతా మాసోత్సవాలు


విజేతలైన విద్యార్థులతో డిఆర్‌వో, రవాణా శాఖ అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు ముగింపు కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రహదారి భద్రతపై పలువురు నిపుణులు, అధికారులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ ఏడాది జిల్లాలో 889 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, వాటిలో 285 మంది మరణించగా, 1043 మంది గాయపడ్డారని అధికారులు వివరించారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం వంటి కారణాల వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప రవాణా కమిషనర్ విజయసారథి, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్ సుధాకర్, డీఎంహెచ్‌ఓ టీవీ బాలమురళీకృష్ణ, జిల్లా అగ్నిమాపక అధికారి మోహన్‌రావు, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు పి.వి.గంగాధర్, ఆర్.అనిల్, మున్సిపల్ ఇంజినీర్ దక్షిణామూర్తి, నెహ్రూ యువ కేంద్రం కో–ఆర్డినేటర్ ఉజ్వల్, రవాణా శాఖ అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలు వీరే :

క్విజ్: కె.లోహిత(కేజీబీవీ, గార), ఎస్.రేఖ(కేజీబీవీ, గార), బి.రాజానందిని (శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, శ్రీకాకుళం), జి.హితేష్ శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, శ్రీకాకుళం).

వ్యాసరచన: టి.హారిక (బీఎస్సీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి), ఎ.సూర్య (బీఎస్సీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి), పి.రేణుశ్రీ (డిగ్రీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నరసన్నపేట), కె.రాము (డిగ్రీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నరసన్నపేట), జె. ఝాన్సీరాణి (సెయింట్ క్లారెట్ ఇ.ఎం. పాఠశాల, నరసన్నపేట), జె.హోఁయ్ (9వ తరగతి) – సెయింట్ క్లారెట్ ఇ.ఎం. పాఠశాల, నరసన్నపేట), యు.మానస (సెయింట్ క్లారెట్), డి.సింధూర (సెయింట్ క్లారెట్), కె.హారిక (బీఎస్సీ, గాయత్రీ కళాశాల, మునసబ్‌పేట), ఎం.జోష్నవి (గాయత్రీ కళాశాల), డి.మేనక (గాయత్రీ కళాశాల), టి.తైవేన్ (ఆదిత్య డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం), హాసిని (డిగ్రీ)(ఆదిత్య డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం)

గ్రంథాలయాలతోనే సమాజ చైతన్యం



ప్రసంగిస్తున్న కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

శ్రీకాకుళం కల్చరల్: సమాజ చైతన్యానికి గ్రంథాలయాలుతో అవసరమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. శ్రీకాకుళం ఎన్జీవో హోమ్‌లో శనివారం గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలతోనే మేధావి వర్గం తయారవుతుందన్నారు. గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాల సెస్ బకాయిలు రూ.710 కోట్లు ఉన్నట్లు వివరించారు. రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ ఒకప్పుడు పంచాయతీల స్థాయిలో గ్రంథాలయాలు ఉండేవని, ఇప్పుడవి కనుమరుగైపోయాయని చెప్పారు. అరసం రాష్ట్ర కార్యదర్శి శరత్ చంద్ర జ్యోతి మాట్లాడుతూ కొత్త తరాల జ్ఞాన వికాసానికి గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం తోడ్పాటునందిస్తుందన్నారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యమానికి తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. అరసం రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు నల్లి ధర్మారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత జామి భీమశంకర్, జీన్ గ్రంథాలయ వ్యవస్థాపకులు పత్తి సుమతి, బూర్జ మండల ఉపాధ్యక్షులు బుడుమూడు సూర్యారావు, సీపీఐ పట్టణ కార్యదర్శి టి.తిరుపతిరావు, విశ్రాంత ఇంజినీర్ బి.ఎ. మోహనరావు, ఇస్కాఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.వి.మల్లేశ్వరరావు, జి.వి. నాగభూషణరావు, పాలకొండ డివిజన్ గ్రంథాలయ ఉద్యమ నాయకులు సుబ్బా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతుడు నవీన్

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కుశాలపురం సమీపంలో బైపాస్ కూడలి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సవర నవీన్ (21) అనే యువకుడు మృతి చెందాడు. బంధువుల అమ్మాయితో కలిసి బైక్‌పై విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వస్తుండగా వేకువజామున 5.30 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అయితే బైకు అదుపు తప్పిందా.. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందా అనే విషయం తెలియడం లేదు. అంబులెన్స్ వచ్చేలోగానే నవీన్ మృతి చెందగా.. యువతి స్వల్ప గాయాలతో బయటపడింది. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించిన పోలీసులు.. గాయపడిన యువతిని శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నవీన్ స్వగ్రామం పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం కుడ్డపల్లి. తండ్రి అనప పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ గత ఏడాది ఫిబ్రవరిలో అనారోగ్యంతో మృతి చెందారు. సరిగ్గా ఏడాదికే కుమారుడు కూడా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

క్లుప్తంగా

రైల్వే జీఎం పర్యటనకు శరవేగంగా ఏర్పాట్లు


ప్రహరీ గోడలపై రంగులద్దుతున్న పెయింటర్‌లు

విజయనగరం టౌన్‌: ఈస్ట్‌కోస్ట్‌ రైల్వే జనరల్‌ మేనేజర్‌ పరమేశ్వర్‌ ఈ నెల 17న సోమవారం జిల్లా పర్యటన నేపథ్యంలో స్థానిక రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో రైల్వేస్టేషన్‌ ప్రాంగణాన్ని అత్యాధునిక హంగులతో ముస్తాబు చేస్తున్నారు. 17న ప్రత్యేక రైల్లో భువనేశ్వర్‌ నుంచి బయలుదేరి రాయగడ ఇన్‌స్పెక్షన్‌ చేసిన తర్వాత నేరుగా విజయనగరం చేరుకుంటారని అధికారులు తెలిపారు.

లెండి ఇంజినీరింగ్‌ కళాశాలలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

డెంకాడ: రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరో ప్రాణాన్ని కాపాడవచ్చని లెండి ఇంజినీరింగ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వీవీ రామారెడ్డి అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్‌ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు 250 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవరుచుకోవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో విజయనగరానికి చెందిన ఎన్‌వీఎన్‌, రోటరి పార్వతిదేవి అంచలియా వలంటరీ బ్లడ్‌బ్యాంక్‌, విశాఖకు చెందిన ఎన్‌టీఆర్‌ మెమోరియల్‌ ట్రస్ట్‌ బ్లడ్‌బ్యాంక్‌, రోటరీ బ్లడ్‌బ్యాంక్‌, ఏఎస్‌ రాజా వలంటీర్‌ బ్లడ్‌ బ్యాంక్‌లు పాల్గొని రక్తసేకరణ చేపట్టాయని వైస్‌ ప్రిన్సిపాల్‌ టి. హరిబాబు తెలిపారు.

కారును ఢీకొన్న స్కూటర్‌

- ఇద్దరికి తీవ్ర గాయాలు


ఫ్లైఓవర్‌పై అచేతనంగా పడి ఉన్న యేసు

బొబ్బిలి: పట్టణంలోని రైల్వే ఫ్లెఓవర్‌ బ్రిడ్జిపై శనివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. సాలూరు పట్టణం మెంటాడ వీధికి చెందిన ముగ్గురు యువకులు ఓ ఫంక్షన్‌ కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఫ్లెఓవర్‌ బ్రిడ్జిపై ఓ కారును ఢీకొన్నారు. ఒకే స్కూటర్‌పై ముగ్గురు యువకులు వెళ్తుండగా ఫ్లెఓవర్‌పై ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వాడపల్లి యేసు కృపాకర్‌, పట్నాన ప్రసాద్‌లు తీవ్రంగా గాయపడ్డారు. మరో యువకుడు గనివాడ శేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108లో స్థానిక సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతుడు నవీన్‌

ఎచ్చెర్ల క్యాంపస్‌: మండలంలోని కుశాలపురం సమీపంలో బైపాస్‌ కూడలి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సవర నవీన్‌ (21) అనే యువకుడు మృతి చెందాడు. బంధువుల అమ్మాయితో కలిసి బైక్‌పై విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వస్తుండగా వేకువజామున 5.30 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అయితే బైకు అదుపు తప్పిందా.. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందా అనే విషయం తెలియడం లేదు. అంబులెన్స్‌ వచ్చేలోగానే నవీన్‌ మృతి చెందగా.. యువతి స్వల్ప గాయాలతో బయటపడింది. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించిన పోలీసులు.. గాయపడిన యువతిని శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నవీన్‌ స్వగ్రామం పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం కుడ్డపల్లి. తండ్రి అనప పోలీస్‌ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ గత ఏడాది ఫిబ్రవరిలో అనారోగ్యంతో మృతి చెందారు. సరిగ్గా ఏడాదికే కుమారుడు కూడా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

కూటమి ప్రభుత్వంలో అన్నదాతకు అష్టకష్టాలు తప్పడం లేదు. రైతుభరోసా వంటి పథకాలు ఎలానూ అందలేదు. ఆర్‌బీకేల్లో విత్తనం నుంచి యూరియా వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు సకాలంలో అందేవి. ప్రస్తుతం ఆ పరిస్థితుల్లేవు. చివరకు యూరియా కూడా లేదనే స్టాక్‌ బోర్డులు వెలుస్తున్నాయి. దీంతో ప్రైవేటు వ్యాపారులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తూ అన్నదాతను దోచుకుంటున్నారు.

యూరియా.. నో స్టాక్..!


పీఏసీఎస్‌ వద్ద నో స్టాక్‌ బోర్డు

- దర్శమిస్తున్న బోర్డులు
- బ్లాక్‌ మార్కెట్‌లో రూ.350లు
- అన్నదాతకు తప్పని యూరియా కష్టాలు

గజపతినగరం రూరల్‌: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగం కుదేలవుతోంది. రైతులకు ఇవ్వాల్సిన రాయితీలు ఇవ్వకపోగా పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కూడా లభించకపోవడంతో అరకొర ధరలకు అమ్ముకుంటూ నష్టాల పాలవుతన్నారు. మరో వైపు అన్నదాతకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. మార్కెట్‌లో యూరియా కొరత ఉండటంతో బ్లాక్‌ మార్కెట్‌లో అధిక ధరలకు వ్యాపారులు విక్రయిస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారు. ఇదిలా ఉంటే రైతులు పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాల చుట్టూ ఎంత తిరిగినా లభ్యం కావడం లేదు. గజపతినగరం మండలంలో 20 రైతు సేవా కేంద్రాలున్నాయి. ఏ కేంద్రంలో కూడా


బ్లాక్‌ మార్కెట్లో యూరియా

యూరియా ఒక్క బస్తా కూడా స్టాక్‌ లేకపోవడంతో కేంద్రాల నుంచి వెనుదిరుగుతున్నారు. పీఏసీఎస్‌ల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. యూరియా కోసం వెళ్లిన రైతులకు యూరియా నో స్టాక్‌ అనే బోర్డును తగిలించి అధికారులు వెనక్కి పంపేస్తున్నారు. మండలంలోని రబీలో వరిని సాగు చేస్తున్న రైతులకు ఎకరానికి కనీసం ఐదు బస్తాలైన యూరియా వేయాల్సి ఉంటుంది. మార్కెట్‌లో యూరియా కొరత వల్ల ఒక్క బస్తా కూడా వేయలేని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

బ్లాక్‌లో రూ.360 పైమాటే

సాధారణంగా మార్కెట్‌లో యూరియా బస్తా రూ.266 ఉంది. ప్రస్తుతం యూరియా సరఫరా లేనందున దళారులు బ్లాక్‌లో బస్తాను రూ.350లకు పైగానే విక్రయిస్తున్నారు. అది కూడా అత్యంత గోప్యంగా విక్రయిస్తున్నారు. దీంతో సామాన్యులకు యూరియా అందని ద్రాక్షగా మారింది. యూరియా కోసం ఎంత తిరిగినా లభించడం లేదు. మునుపెన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదని రైతులు చెబుతున్నారు. అధిక ధరలు, బ్లాక్‌ మార్కెట్ను నియంత్రించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మునుపెన్నడూ ఇలా లేదు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పుష్కలంగా ఎరువులు రైతు భరోసా కేంద్రాలలోనే ఎప్పుడు కావాలంటే అప్పుడే లభించేవి. ఇప్పుడు స్టాక్‌ లేదంటున్నారు. యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రైవేటు వ్యాపారుల వద్ద యూరియా అడిగితే రూ.360 నుంచి 400 చెబుతున్నారు. పీఏసీఎస్‌ల వద్ద కూడా నో స్టాక్‌ అనే బోర్డు పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు అందుతున్న సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది.

– బొత్స అప్పన్న, రైతు, కొత్తబగ్గాం

ఇబ్బంది పడుతున్నాం..

యూరియా లభించక ఇబ్బంది పడుతున్నాం. మండలంలో ఏ రైతుభ రోసా కేంద్రాంలో కూడా యూరియా ఉండటం లేదని సమాచారం. గతంలో ఇటువంటి పరిస్థితి లేదు. బ్లాక్‌ మార్కెట్లో లభిస్తున్న యూరియా ప్రభుత్వ రైతుసేవా కేంద్రాలలో ఎందుకు లభించడం లేదో అర్థం కావడం లేదు. ప్రభుత్వం దృష్టి సారించి యూరియా రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలి

-పి.పైడితల్లి, రైతు, సీతారామాపురం

ఫిర్యాదు చేస్తే చర్యలు

యూరియా బ్లాక్‌లో అమ్ముతున్నట్లు మా దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. అలాగే రైతు సేవా కేంద్రాలలో యూరియా కొరత ఉంది. రెండు రోజుల్లో స్టాక్‌ తెప్పించడం జరుగుతుంది. రైతులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు.

-మహారాజన్‌, ఏడీఏ, గజపతినగరం

పరామర్శకు వెళ్తూ.. మృత్యు ఒడిలోకి...

- ఆటోలో నుంచి జారిపడి మహిళ మృతి
- కొరటాం సమీపంలో ఘటన
- మృతురాలిది మెరకముడిదాం మండలం ఉత్తరావల్లి గ్రామం


ఆటోలో నుంచి జారిపడి మృతి చెందిన మర్రి పద్మ

తెర్లాం: బంధువులు మృతి చెందారని తెలిసి పరామర్శకు బయలుదేరి వెళ్తూ.. మార్గమధ్యలో ఆటోలో నుంచి జారిపడిన మహిళ మృతి చెందిన సంఘటన ఇది. దీనికి సంబంధించి తెర్లాం ఎస్‌ఐ సాగర్‌బాబు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెరకముడిదాం మండలం ఉత్తరావల్లి గ్రామానికి చెందిన మర్రి పద్మ(39) ఆటోలో నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందింది. బలిజిపేట మండలం గంగాడలో బంధువులు మరణించారన్న వార్త తెలుసుకొని గ్రామస్తులతో కలిసి పద్మ బయలుదేరి ఆటోలో వెళ్తుంది. ఆటోలో వెనుక కూర్చొన్న ఆమె మండలంలోని కొరటాం గ్రామ సమీపంలోకి వచ్చే సరికి జారి పడిపోయింది. తల వెనుక భాగంలో రోడ్డు బలంగా తగలడంతో పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మృతి చెందిన విషయం తెలుసుకొని భర్త దుర్గారావు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించాడు. బంధువుల పరామర్శకు వెళ్తూ మృత్యు ఒడికి చేరుకున్న భార్య విగతజీవిగా పడి వుండడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు శివ, నాగమణి ఉన్నారు. శివ హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తుండగా, కుమార్తె ఇంటి వద్దనే ఉంటుంది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాగర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో శవ పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.

సమాజంలో గ్రంథాలయాలది కీలక పాత్ర


మాట్లాడుతున్న ఏపీ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం కన్వీనర్‌ శివప్రసాద్‌

- ఏపీ గ్రంథాలయ పునర్వికాన ఉద్యమం రాష్ట్ర కన్వీనర్‌ శివప్రసాద్‌

విజయనగరం టౌన్‌/అర్బన్‌: సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో గ్రంథాలయాలది కీలక పాత్ర అని ఆంధ్రప్రదేశ్‌ గ్రంథాలయ పునరివ్వికాస ఉద్యమం రాష్ట్ర కన్వీనర్‌ వల్లూరి శివప్రసాద్‌ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం జరిగిన ఏపీ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం జిల్లా కమిటీ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రచయితల సంఘాల ప్రతినిధులు, కవులు, మేధావులు, పాఠకులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి జిల్లాలో గ్రంథాయాల పునర్వికాసం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వంద సంవత్సరాల క్రితం నడిచిన గ్రంథాలయ ఉద్యమం వల్ల గ్రంథాలయాలను పాలకులు అశ్రద్ధ చేయడం అన్యాయమని అన్నారు. గ్రంథాలయాలు తిరిగి ప్రజల ఆదరణ సాధించేందుకు కృషి చేయడం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలను పర్యటిస్తూ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం ఏర్పాటు చేసినట్టు అరసం కార్యదర్శి శరశ్చంద్రజ్యోతిశ్రీ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని తీసుకువెళ్లి గ్రంథాలయాలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. విజయనగరం జిల్లాకు కన్వీనర్‌గా జీఎస్‌.చలం, కో కన్వీనర్‌గా అబ్దుల్‌ రవూఫ్‌ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సేవా సంఘం, ఆంధ్రప్రదేశ్‌ గ్రంథాలయ సంఘం, జయంతి స్మారక జిల్లా గ్రంథాలయ సంఘం, నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయం, అభ్యుదయ రచయతల సంఘం, విజయనగరం రీడ్స్‌ గ్రంథాలయ సంస్థల ప్రతినిధులు రత్నాల బాలకృష్ణ, జీఎస్‌ చలం, ఎస్‌ఎస్‌ఎస్‌ఎస్‌ రాజు, రొంగలి పోతన్న, బద్రి కూర్మారావు, భాషా, ఈశ్వర్‌, బంగారం, లైబ్రేరియన్‌ శ్రీనివాస్‌, గురుప్రసాద్‌ తదితరులతో కమిటీని ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా గుర్రాల పరుగు పోటీలు


నల్లబిల్లిలో గుర్రాల పరుగు ప్రదర్శనలో దౌడు తీస్తున్న గుర్రం

వేపాడ: మండలంలోని నల్లబిల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన గుర్రాల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. ఈ పోటీల్లో విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన 19 గుర్రాలు పాల్గొన్నాయి. వీటిలో విశాఖ జిల్లా పెందుర్తికి చెందిన సురేంద్ర గుర్రం ప్రథమ, నల్లబిల్లికి చెందిన అన్నవరం గుర్రం రెండో స్థానం, రాయపురాజుపేట ఖాళీ గుర్రం తృతీయ స్థానాల్లో నిలిచి వరుసగా రూ.10వేలు, 8వేలు, 6వేలు నగదు బహుమతులు గెలుచుకున్నాయి. కమిటీ నిర్ణయించిన గ్రౌండ్‌లో నాలుగు పర్యాయాలు గుర్రాలు దౌడు తీశాయి. విజేతలకు గ్రామపెద్దలు, దాతల చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తోమడపెద్దుతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

వల్లూరు ఎఫ్‌ఏ తొలగింపు

నెల్లిమర్ల: మండలంలోని వల్లూరు గ్రామ ఉపాధి హామీ ఫీల్డ్‌ అసిస్టెంట్‌ బి.చంద్రకళను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీఓ రామకృష్ణరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన సోషల్‌ ఆడిట్‌లోనూ, గ్రామస్తుల నుంచి ఆమెపై ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టినట్లు చెప్పారు. సదరు విచారణ మేరకు ఆమెను తొలగిస్తూ డ్వామా పీడీ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. 14 రోజుల్లోగా పీడీకి అప్పీల్‌ చేసుకునే అవకాశం కల్పించినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.



చీపురు పట్టిన ఎస్పీ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్రా – స్వచ్ఛ దివాస్‌ కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి స్వయంగా చీపురు పట్టి కార్యాలయ ఆవరణలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. సిబ్బందికి స్ఫూర్తిగా నిలుస్తూ ముందుకు సాగారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చని పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రత ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ సుధాకర్‌, స్పెషల్‌ బ్రాంచ్‌ సీఐ రమేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

– పార్వతీపురం టౌన్‌

శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


శిశుగృహలో శిశువుతో ముచ్చటిస్తున్న పద్మావతి

విజయనగరం ఫోర్ట్‌: శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె శనివారం కె.ఎల్‌.పురంలో ఉన్న శిశుగృహను తనిఖీచేశారు. ఇద్దరి శిశువుల ఆరోగ్యంపై ఆరా తీశారు. ఒక శిశువుకు సహస్ర అని నామకరణం చేశారు. పిల్లల వ్యక్తిగత రికార్డు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఆ తర్వాత బాలసదన్‌ను పరిశీలించారు. స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించి అర్ఫాన్‌, సెమి అర్ఫాన్‌ పిల్లలను తప్పనిసరిగా చేర్చుకోవాలన్నారు. వంటగది, పిల్లల మంచాలు పరిశీలించి స్వచ్ఛత, శుభ్రత మరింత పాటించాలని సూచించారు. పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం సీడీపీఓ, డీసీపీయూ, చైల్డ్‌లైన్‌, ఎంఈఓలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వచ్చేనెల 17 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న 10 తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్‌ పీడీ రుక్సానా బేగం, సీడీపీఓలు ప్రసన్న, ఉమాభారతి, ఆరుద్ర, డీఈఓ మాణిక్యంనాయుడు, ఏపీసీ డాక్టర్‌ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల కాలం..యోగాసనాలతో ఏకాగ్రత

- ఒత్తిడిని జయించవచ్చు..
- ప్రాణాయామం.. ఎంతో ప్రయోజనం
- రోజూ 25 నిమిషాలు చేస్తే ఎంతో మేలు
- ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుదల


సీతంపేట వైటీసీ ఆవరణలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

వీరఘట్టం: విద్యార్థులకు ఇది పరీక్షల కాలం. మార్చి 1 నుంచి ఇంటర్మీడియట్‌ పబ్లిక్‌ పరీక్షలు, మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు. నీట్‌ నుంచి ఐఐటీ వరకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇది కష్టకాలం. అన్నింటికి మార్కులతో కుస్తీ పడాలి. ఇది కేవలం జ్ఞాపకశక్తితో చేసే పోరాటం కాదు. ప్రశాంత చిత్తానికి ఏకాగ్రతకు లంకె కుదరాలి. లక్ష్య సాధనకు అలుపెరగని ప్రయత్నానికి అన్వయం సరిపోవాలి. పుస్తకాలు ముందేసుకొని గంటల కొద్ది కుస్తీ పడితే సాగిపోయే వ్యాసంగం కాదిది. మనలోని అణువణువు చైతన్యవంతమైతే లక్ష్యం పాదాక్రాంతమవుతుంది. అలాంటి శక్తులను నిచ్చేది విద్యార్థిలో అనంత శక్తులను నింపగలిగేది యోగా ఒక్కటేనని నిపుణులు చెబుతున్నారు. యోగాలో ప్రాణాయామం, ఆసనం వంటి ప్రక్రియలు ఉన్నాయి. వీటిని రోజుకు 25 నిమిషాలు సాధన చేస్తే చాలు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగటంతో పాటు శారీరక రుగ్మతలు దూరమవుతాయి. ఆత్మ విశ్వాసం పెంపొందుతుంది. పరీక్షలో మంచి మార్కులు సాధించడానికి దోహదపడుతుందని యోగా గురువులు చెబుతున్నారు. ఇందులో భాగంగా మండలంలోని వీరఘట్టం, తలవరం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ప్రతీ రోజూ పదో తరగతి విద్యార్థులు 25 నిమిషాల పాటు యోగాసనాలు వేస్తూ ఏకాగ్రతను తమ సొంత చేసుకుంటున్నారు.

ప్రాణాయామం

పిల్లల్లో ఒత్తిడిని దూరం చేసేందుకు జ్ఞాపకశక్తి, చక్కటి ఆరోగ్యం ఏకాగ్రత పెంపొందించడంలో ప్రాణాయామం ఉపయోగపడతాయి. ఇది కళ్లు మూసుకొని పద్మాసనంలో నిటారుగా కూర్చొని శ్వాసపైనే ధ్యాస ఉంచి చేయాల్సినవి. తాటక క్రియ, ఓంకాయ ఉచ్చారణ కూడా మంచి ఫలితాలను ఇస్తాయి. ఇవన్నీ 10 నుంచి 12 నిమిషాలు చేయాలి.

భ్రమిరి

పద్మాసనం(సిద్ధాసనం)లో నేలపై కూర్చొని చేతులు బ్రొటన వేలుతో చెవులను మూసి, చూపుడు వేలును నుదిటిపై ఉంచాలి. మిగిలిన మూడు వేలుతో కళ్లు మూయాలి. తర్వాత దీర్ఘశ్వాస తీసుకొని గొంతు ద్వారా తుమ్మెద నాదం చేస్తూ నెమ్మదిగా ముక్కు ద్వారా శ్వాసను వదలాలి.

ఉద్గిత్‌

పద్మాసనంలో చిన్ముద్రతో దీర్ఘశ్వాస తీసుకోవాలి. ఓం అంటూ శబ్దం చేస్తూ శ్వాసను వదలాలి. ఇలా చేయడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుంది.

ప్రణవ

పద్మాసనం వేసుకొని ధ్యానం చేస్తున్నట్లు కళ్లు మూసుకొని కూర్చోవాలి. మనసును అదుపులోనికి తీసుకొచ్చిన తర్వాత చదివిన అంశాలను మననం చేసుకోవాలి. దీని ద్వారా మతిమరుపు సమస్య దూరం చేయవచ్చు.

బస్త్రిక

పద్మాసనం వేసి వెన్నుముకను నిటారుగా ఉంచి కూర్చోవాలి. కళ్లు మూసుకొని దీర్ఘశ్వాస తీసుకోవడం, నెమ్మదిగా వదలడం చేయాలి. ఇలా చేయడం ద్వారా ఒత్తిడిని అధిగమించి జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవచ్చు.

అనులోమ, విలోమ

పద్మాసనంలో కూర్చొని ఎడమచేతిని జ్ఞాన ముద్రలో ఉంచాలి. కుడి చేతి బొటనివేలును కుడి నాసికను మూసి ఎడమ నాసిక ద్వారా నెమ్మదిగా దీర్ఘ శ్వాస తీసుకోవాలి. తర్వాత కుడి నాసికపై బొటన వేలిని తీసేసి ఎడమ నాసికను మూడు వేలుతో మూసి నాసికల ద్వారా నెమ్మదిగా శ్వాస వదలాలి. అలా కుడి, ఎడమ నాసికల ద్వారా శ్వాస ప్రక్రియ చేయాలి. దీనివల్ల జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు మానసిక రుగ్మతలు తొలుగుతాయి.

తాటక ప్రక్రియ

వజ్రాసనంలో నిటారుగా కూర్చోవాలి. ఎదురుగా రెండు అడుగుల దూరంలో దీపం లేదా గోడకు బొట్టు పెట్టి దానిపై దృష్టి పెట్టాలి. అలా కాని పక్షంలో కుడి చేతి బొటనవేలిని ముందుకు చాచి ఆ వేలిపైనే ఏకాగ్రతతో దృష్టిని నిలపాలి. ఇలా సాధన చేయడం వల్ల భవిష్యత్‌లో కంటి సమస్యలు రాకుండా నివారించవచ్చు.

ఏకాగ్రత పెరుగుతుంది



యోగాసనాలతో విద్యార్థుల్లో మానసిక పరివర్తనతో పాటు, శారీరక పెరుగుదల ఉండి, ఏకాగ్రత పెరుగుతుంది. ఉజ్వల భవిష్యత్‌కు యోగా దోహదపడుతుంది. యోగాసనాలు వలన విద్యార్థులు క్షణికావేశానికి గురికాకుండా ఒత్తిడిని జయించగలుగుతారు. ప్రతి దినం సాధనం చేస్తే ఏకాగ్రత సాధించవచ్చు. పరీక్షలలో నిర్భయంగా ప్రశ్నలకు సమాధానాలు రాయగలుగుతారు.

– కె.జనార్ధనరావు, యోగా గురువు, తలవరం జెడ్పీహెచ్‌ఎస్‌, వీరఘట్టం

మానసిక ప్రశాంతత



యోగాసనాలు వలన విద్యార్థుల్లో మానసిక ప్రశాంతత కలుగుతుంది. మార్కుల కోసం కుస్తీ పడుతున్న ఈ పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే విద్యార్థులకు యోగాయే సరైన మార్గం. దీని వలన జ్ఞాపకశక్తి పెరిగి విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా రాయవచ్చు.

– శిర్లాపు ఉమామహేశ్వరరావు, పీడీ, బాలుర ఉన్నత పాఠశాల, వీరఘట్టం

నిత్య సాధన చేయాలి

యోగాసనాలతో పాటు ప్రాణాయామం నిత్య సాధన చేయడం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. పరీక్షల సమయంలో సాధారణంగా తలెత్తే ఒత్తిడి సమస్యలను అధిగమించవచ్చు. దీని వల్ల పరీక్షలకు బాగా సిద్ధమవ్వొచ్చు. మంచి మార్కులు సాధించవచ్చు.

కుటీర పరిశ్రమల ఏర్పాటుకు చేయూత

- ఏపీఎఫ్‌పీఎస్‌ జనరల్‌ మేనేజర్‌ సాయిశ్రీనివాస్‌



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవనసశాఖ అధికారి జమదగ్ని

లక్కవరపుకోట: ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం (ఏపీఎఫ్‌పీఎస్‌)లో భాగంగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసే రైతులకు ఆర్థిక చేయూతనిస్తున్నట్లు ఆ సంస్థ జనరల్‌ మేనేజర్‌ సాయిశ్రీనివాస్‌ తెలిపారు. మండలంలోని భీమాళి గ్రామంలో మామిడి తాండ్ర తయారీదారులకు శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుటీర పరిశ్రమలో తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్‌ సదుపాయం కల్పిస్తామన్నారు. ఉద్యానవనశాఖ అధికారి ఎ.వి.జమదగ్ని మాట్లాడుతూ కుటీర పరిశ్రమ ఏర్పాటుకు రైతు వాటాగా 10 శాతం చెల్లిస్తే 90 శాతం బ్యాంక్‌ రుణం రూపంలో ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఇందులో 35 శాతం రాయితీ వర్తిస్తుందని చెప్పారు. ఉద్యానవన శాఖ పరిధిలో ఏర్పాటుకు అవకాశమున్న పరిశ్రమలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఓ పప్పుపద్మ, డీఆర్‌పీ కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.